

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని సీపీ అనురాధ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట టూ టౌన్ పోలీస్‌స్టేషన్, సిద్దిపేట ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్స్ రైటర్ రూమ్, సిబ్బంది కిట్ ఆర్టికల్‌ను పరిశీలించారు, పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.

గాంధీనగర్‌లో ఒకరికి డెంగ్యూ

- మహిళకు నిర్ధారణ.. గ్రామంలో వైద్యశిబిరం

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళకు డెంగ్యూ నిర్ధారణ కావడంతో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పరీక్షలు చేయగా, డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ఈ నేపథ్యంలో మంగళవారం మీర్జాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది గాంధీనగర్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆమె కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. ఆ ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు మందులు పిచికారీ చేసి, శుభ్రం చేశారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. క్యాంపులో వైద్యాధికారిణి డాక్టర్ ఖాజా మహిమూన భాను, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



చరిత్ర మరువని రోజు

సెప్టెంబరు 17

7

వీరులారా.. వందనం

- రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం
- ప్రాణాలు అర్పించిన యోధులు

7

ప్రస్తుతానికి, మరో 50 ఏళ్లకు సరిపడా మంజీరా వాటర్ స్కీమ్ డిజైన్ చేయండి

సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో నీటిసరఫరాపై నిర్మల, జగ్గారెడ్డి సమీక్ష

హాజరైన మున్సిపల్, పబ్లిక్ హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, హెచ్‌ఎండబ్ల్యుఎస్ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు

తక్షణ నీటి సరఫరా కోసం రూ.15కోట్లతో తాళ్లపల్లి ఫిల్టర్‌బెడ్ ఆధునీకరణ, నాలుగు మండలాల్లో ట్యాంకులు, పైపులైన్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

వచ్చేనెలలోనే సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన : నిర్మల, జగ్గారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన నీళ్లందించేలా ప్రస్తుతానికి, మరో యాభై సంవత్సరాలకు సరిపడా మంజీరా వాటర్ స్కీమ్ డిజైన్ చేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. మంగళవారం వారు సంగారెడ్డిలో మున్సిపల్, పబ్లిక్‌హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీ వరకు నివేదిక సిద్ధం చేస్తే నిర్మలతో కలిసి ఈఎన్సీకి రిపోర్టు అందజేస్తానని చెప్పారు. వచ్చే నెల 15వ తేదీ లోపు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని, ఈ విషయంపై మంత్రి దామోదర్ రాజనర్సింహతో కూడా మాట్లాడినట్లు వివరించారు. రెండు మున్సిపాలిటీల్లో ప్రతీ రోజు ఏక కాలంలో రెండు గంటల పాటు మంజీరా నీరందేలా డిజైన్ చేయాలని తెలిపారు. తక్షణ అవసరంగా తాళ్లపల్లి ఫిల్టర్‌బెడ్ నుంచి ప్రత్యేక లైన్ వేస్తే 54 గ్రామాలకు మంజీర నీటిని సరఫరా చేయొచ్చని అధికారులు చెప్పగానే జగ్గారెడ్డి స్పందించి సీఎంతో మాట్లాడి రూ. 10కోట్లు, ఇతర మరమ్మతులకు మరో రూ. 5కోట్లు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు.



హాజరైన అధికారులు, నియోజకవర్గ నాయకులు

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి సిద్ధం

- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి రాక
- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి

నంగునూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం నర్మెట్టలో రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి సిద్ధమైందని తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆయిల్ ఫెడ్ అధికారులతో కలిసి ఫ్యాక్టరీ ఆవరణలో ఎఫ్ఎఫ్‌బీ ర్యాంపును ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఫ్యాక్టరీని ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, రైతులకు లాభదాయకమైన పంటలు అందించేందుకు ఈ ఫ్యాక్టరీని నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఫ్యాక్టరీ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన

- జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు
- గరిష్ఠంగా 89.0 మి. మీ.
- పొంగిపొర్లుతున్న చెరువులు, చెక్‌డ్యాంలు
- వర్షానికి దౌల్తాబాద్‌లో కూలిన ఇల్లు
- ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధ దంపతులకు గాయాలు



సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)
తొగుట	89.0
దౌల్తాబాద్	54.3
చిన్నకోడూర్	48.3
గజ్వేల్	34.5
దుబ్బాక	27.0
బెజ్జంకి	24.5
మర్కుక్	19.8
మిరుదొడ్డి	17.0
కొహెడ	16.5
అక్బర్‌పేట-భూంపల్లి	13.5

సిద్దిపేట/దౌల్తాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జోరువాన కురుస్తున్నది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి చెరువులు, చెక్ డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. తొగుట, దౌల్తాబాద్‌లో భారీ వర్షం కురిసింది. ఇక సిద్దిపేట, గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్, దుబ్బాక, మిరుదొడ్డి, చేర్యాల, కుకునూర్‌పల్లి, కొండపాకలో మోస్తరు వర్షం కురిసింది. గరిష్ఠంగా 89.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

కూలిన పాత ఇల్లు.. దంపతులను కాపాడిన స్థానికులు



దౌల్తాబాద్ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన పాత ఇల్లు కూలి, నిద్రిస్తున్న వృద్ధ దంపతులకు గాయాలైన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. దౌల్తాబాద్‌కు చెందిన కమ్మరి పెద్ద లక్ష్మయ్య (75), శారద (65) దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా, అర్ధరాత్రి మూడు గంటల సమయంలో ఇంటి పైకప్పు, గోడలు కూలిపోయాయి. దీంతో దంపతులిద్దరూ శిథిలాల కింద చిక్కుకున్నారు. వారి అరుపులు విని చుట్టుపక్కల వారు పోలీసుల సహాయంతో ఇద్దరిని బయటకు తీశారు. అనంతరం వారిని అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఇల్లు కూలి గాయపడిన వృద్ధ దంపతులు

282.08 ఎకరాల్లో పంట నష్టం

- 455 మంది రైతుల పొలాల్లో చేరిన ఇసుక మేటలు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ఎకరానికి రూ. 10 వేల పరిహారం

సిద్దిపేట సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టులో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ముంచెత్తిన వరదలతో వాగులు, చెరువులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. పలు చోట్ల ఉధృతంగా వరద ప్రవహించడంతో పంటపొలాల్లోకి నీరు చేరింది. పంటలు మునిగిపోవడంతో రైతులు తల్లడిల్లారు. వర్షం తగ్గడంతో క్రమేణా పొలాల నుంచి వరద నీరు వెళ్లిపోవడంతో, వ్యవసాయశాఖ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై వివరాలు సేకరించారు. మొత్తంగా 282.08 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు లెక్క తేల్చారు. జిల్లాలో పలు గ్రామాలకు చెందిన 455 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయపు భూముల్లో 254.20 ఎకరాల్లో వరి, 17.04 ఎకరాల్లో మొక్కజొన్న, 10.24 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు నిర్ధారించారు. ఎక్కువగా వరి పంట నష్టపోగా త్వరలోనే పంట నష్టం అందించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



ఎన్సాన్‌పల్లి శివారులో పొలంలోకి వర్షానికి కొట్టుకొచ్చిన ఇసుక

ఎకరానికి రూ. 10 వేలు

జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 10 వేల

మిగతా 8వ పేజీలో

ఆవాస్ ప్లస్ రీసర్వే గడువు పెంపు

- ఈనెల 30 వరకు..
- గ్రామ కార్యదర్శులకు ఊరట

దుబ్బాక, సెప్టెంబరు 16 : గ్రామీణ ఆవాస్ ప్లస్ పథకం కింద లబ్ధిదారుల రీసర్వే గడువును ఈ నెల 30 వరకు పొడిగించడంతో గ్రామ కార్యదర్శులు ఊపిరి పీల్చుకున్నారు. సాంకేతిక సమస్యలు, తక్కువ సమయం వంటి కారణాల వల్ల సర్వే అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. దీంతో ప్రభుత్వం గడువును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు జిల్లాలో కేవలం 32,746 మంది వివరాలు మాత్రమే నమోదయ్యాయి.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణానికి నిధులు పొందాలంటే లబ్ధిదారుల వివరాలను ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గత డిసెంబరులో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లాలో 75,025 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. వీరి వివరాలను ఆగస్టు 3వ తేదీలోగా ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, క్షేత్రస్థాయిలో గ్రామ కార్యదర్శులకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఒక లబ్ధిదారుడి వివరాలు నమోదు చేయడానికి 20 నిమిషాల నుంచి గంట వరకు సమయం పడుతోంది. లబ్ధిదారుడి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు వివరాలు, లొకేషన్ వివరాలతో పాటు ముఖ చిత్రాన్ని ఫేస్ యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వృద్ధుల ముఖాలు, కనురెప్పల వివరాలు సరిగా నమోదు కాకపోవడంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. ఈ ఇబ్బందుల కారణంగా మూడు నెలలైనా సగానికి పైగా సర్వే పూర్తి కాలేదు. ఇప్పటివరకు 75,025 మందికి గాను కేవలం 32,746 మంది వివరాలు మాత్రమే నమోదయ్యాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఈ నెల 30 వరకు గడువును పొడిగించింది. సోమవారం ఈ ఆదేశాలు జారీ కాగా మంగళవారం జిల్లా అధికారులు గ్రామ కార్యదర్శులకు ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ పొడిగింపుతో గ్రామ కార్యదర్శులపై కొంత ఒత్తిడి తగ్గింది. అయితే, ఈ నెల చివరి నాటికి కూడా మొత్తం సర్వే పూర్తవుతుందా? అనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా

ఈ పథకం కింద ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 72వేలు, మరుగుదొడ్డి కోసం రూ. 12 అందిస్తుంది. మిగిలిన రూ. 4.16లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఇంటి విస్తీర్ణం కేంద్ర నిబంధనల ప్రకారం 396 చదరపు అడుగులు కాగా, రాష్ట్ర ప్రభుత్వం 600 చదరపు అడుగుల ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

భూ సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ హైమావతి

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా, ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం జగదేవ్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోగా, సాధారణంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను దౌలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విషజ్వరాలు, ఒళ్లు నొప్పులు, సాధారణ జ్వరం వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని, గ్రామాల్లోని ప్రైవేట్ క్లినిక్‌లు, ఆర్‌ఎంపీలను, పీఎంపీలను ఆశ్రయించవద్దని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. దౌలాపూర్‌కు 24 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 22 నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ నిర్మల, ఎంపీడీవో రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లోని పీహెచ్‌సీలో షుగర్ టెస్ట్ చేయించుకుంటున్న కలెక్టర్ హైమావతి

చిరుత కాదు.. నక్క!

- చుంచనకోట శివారు గుట్టల్లో సంచారం
- ట్రాప్ కెమెరా ద్వారా గుర్తించిన అటవీ అధికారులు



చుంచనకోట గుట్టలో ట్రాప్‌కెమెరాకు చిక్కిన నక్క

చేర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం చుంచనకోటలోని గుట్టల శివారు వ్యవసాయ బావుల వద్ద సంచరిస్తున్నది చిరుత పులి కాదని, అది పెద్దనక్క అని అటవీ అధికారులు నిర్ధారించారు. కొద్దిరోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావి వద్ద లేగదూడను అపహరించి సమీప గుట్టల్లోకి ఈడ్చుకెళ్లి చంపడంతో చిరుతపులి సంచరిస్తుందన్న పుకార్లు మొదలయ్యాయి. దీంతో అటవీ అధికారులు ఒక ట్రాప్ కెమెరా బిగించినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల గుట్టల శివారులోని చెరువు సమీపంలో పులి కనిపించిందని మహిళలు చెప్పడంతో అక్కడ మరో రెండు కెమెరాలు బిగించారు. ఈనెల 14న తెల్లవారుజామున ఓ పెద్దనక్క చెరువు వైపు వెళ్తున్నట్లు కెమెరాలో రికార్డయింది. దీంతో అక్కడ తిరుగుతున్నది పెద్దపులి కాదు నక్క అని అధికారులు నిర్ధారించారు. అయితే పాదముద్రలు వేరుగా ఉన్నాయని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఆర్టీఐను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)2005ను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం 2005పై పీఐవోలకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలో సమాచార హక్కు చట్టం ద్వారా తక్కువ దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, ఇందుకు కృషిచేసిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 1700 దరఖాస్తులను కూడా పరిష్కరించాలనే జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, అయోధ్య రెడ్డి, మొహసిన పర్వీన్, కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పలువురు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం పట్టివేత

● పోలీస్ స్టేషన్‌కు తరలింపు



బియ్యం తరలిస్తున్న లారీ

పుల్‌కల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద పుల్కల్ ఎస్ఐ ఎన్.విశ్వజన్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో (ఎంహెచ్ 22ఏఏ 3921) నంబరు గల లారీలో రేషన్ (దొడ్డు) బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యానికి సంబంధించిన పత్రాలు చూపించాలంటూ డ్రైవర్‌కు సూచించగా, తన వద్ద ఎలాంటి పత్రాలు లేవనడంతో లారీని పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వజన్ పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. పంచనామా చేసి నిర్ధారణ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ నయాబ్ తహసీల్దార్ సాజీద్దీన్ తెలిపారు.

ఈ కష్టం.. ఇంకెన్నాళ్లు

- మూడువారాలైనా కల్వర్టును బాగు చేయరా?
- అవస్థలు పడుతూ స్కూల్‌కు వెళ్తున్న పిల్లలు
- రోగం వస్తే వీపుపై మోసుకెళ్తున్న దైన్యం



కష్టంగా కల్వర్టు దాటుతున్న ప్రజలు

రామాయంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ కష్టం ఇంకెన్నాళ్లు..! మూడువారాలైనా ముందడుగు ఏదీ..? అంటూ ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామాయంపేట మండల పరిధి పర్వతాపూర్ వెళ్లే కల్వర్టు వరదలకు కొట్టుకుపోయింది. దీంతో 20 రోజులుగా రోడ్డు తెగి పక్క గ్రామాలకు వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. అటు కళాశాలలు, హైస్కూల్ వెళ్లే విద్యార్థులు పడుతూ.. లేస్తూ వెళ్లాల్సి వస్తోంది. ఈ కల్వర్టు అవతల కిషన్, లక్యాతండాలతో పాటు పర్వతాపూర్ గ్రామాలు ఉన్నాయి. ఇన్నిరోజులుగా ఈ ప్రాంత ప్రజానీకం బిక్కుబిక్కుమంటూ కాలం వెలదీస్తోంది. ఎవరికైనా వైద్య అవసరాలు వస్తే.. వీపుపై రోగులను మోసుకెళ్లాల్సిన దుస్థితి పట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

నడుచుకుంటూ వెళ్తున్నాం

20 రోజులుగా నడుచుకుంటూ డిగ్రీ కాలేజీకి వెళ్తున్నాం. నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. లక్యాతండా నుంచి లక్ష్మాపూర్ గేటు వద్దకు వెళ్లి బస్సులో రామాయంపేటకు వస్తున్నాం.

-కృపావతి, విద్యార్థి

రోడ్డు తెగిపోవడం వల్లే కష్టం

కల్వర్టు వరదలకు కొట్టుకుపోవడంతో మూడువారాలుగా నడుచుకుంటూ లక్యాతండా పాఠశాలకు వెళ్తున్న. రోడ్డు తెగిపోవడం వల్ల ఇంత కష్టం వచ్చింది.

- విజయ్‌కుమార్, ప్రభుత్వ టీచర్

నిఘా కట్టుదిట్టం చేయాలి

- నేరాల అదుపుకు పటిష్ట చర్యలు
- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



హత్నూర పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

హత్నూర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం హత్నూర పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, సిబ్బంది బ్యారక్‌లతో పాటు, పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామంపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని ప్రతీ సమాచారం అందేలా చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పొందుపరిచే రికార్డులు పార్ట్ 1 నుంచి 5వరకు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తెలంగాణ పోలీసుశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సీఈఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి అన్నిరకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నయీం, ఎస్‌హెచ్‌వో శ్రీధర్ రెడ్డి, సీసీ విజయ్‌పవార్ పాల్గొన్నారు.





గుండెపోటుతో వేర్వేరుగా ఇరువురు ఉద్యోగులు మృతి



షాబోద్దీన్



పండరి

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఒకేరోజు నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఇరువురు ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం మృతిచెందారు. నారాయణఖేడ్ ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న షాబోద్దీన్(45) మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉండగా గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. షాబోద్దీన్ మృతితో స్వగ్రామమైన ఝరాసంగం మండలం కుప్పనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. షాబోద్దీన్‌కు భార్య, కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. అలాగే కంగ్టి మండలం పంచమహల్ దామర్‌గిద్దకు చెందిన దరుకు పండరి(40) మియాపూర్-2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం విధి నిర్వహణలో ఉండగా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య రుక్మిణి, కుమారులు ఉన్నారు.

వారంలో ముగ్గురు ఉద్యోగులు..

నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ముగ్గురు ఉద్యోగులు వారంరోజుల వ్యవధిలోనే గుండెపోటుతో మృతిచెందారు. ఈనెల 13న నారాయణఖేడ్ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అటెండర్ మచ్చూరి మొగులయ్య, మంగళవారం షాబోద్దీన్, దరుకు పండరి మృతిచెందారు.





అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి, కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చే మార్గంలేక ఓ యువకుడు ఉరేసుకొని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి గ్రామానికి చెందిన బొల్లెబోయిన అనిల్(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జీవనోపాధికి, కుటుంబ అవసరాలకు అనిల్ అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి 9 గంటలకు భార్య లతకు పని ఉందని బయటకు వెళ్లితిరిగి రాలేదు. కుటుంబీకులు మంగళవారం ఉదయం వెతకగా సమీపంలోని సుప్ర కెమ్ కంపెనీ ఎదురుగా ఉన్న నారాయణరావు వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అనిల్‌కు భార్య లత, ఓ కొడుకు ఉన్నాడు. మృతుడి తండ్రి పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ-౩ యాదగిరి వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హత్నూర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర మండలం చీక్‌మద్దూర్‌లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ(45) గ్రామ శివారులోని దుబ్బ చెరువులో పడిపోయాడు. కాగా గ్రామానికి చెందిన మచ్చుకూరి సత్యనారాయణ, నీరుడి ఏసు అతడిని కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు కృష్ణకు ఇద్దరు భార్యలు లక్ష్మి, విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అందరూ చూస్తుండగా.. రైలు కిందికి వెళ్లి

● మతి స్థిమితం లేని వ్యక్తి మృతి



నర్సింహులు(ఫైల్)

జహీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ మతిస్థిమితం లేని వ్యక్తి అందరూ చూస్తుండగా రైలు కిందికి వెళ్లి చనిపోయాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు, స్టేషన్ అధికారుల కథనం ప్రకారం.. షిర్డి నుంచి తిరుపతికి వెళ్తున్న ప్యాసింజర్ రైలు మంగళవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తోంది. ఈ రైలు కదులుతున్న సమయంలో జిల్లాలోని ఝరాసంగం మండలం ప్యాలవరం గ్రామానికి చెందిన తెనుగు నర్సింలు(55) అందరూ చూస్తుండగా, రైలు కిందికి వెళ్లాడు. ఇతని మానసిక పరిస్థితి బాగాలేదని చెప్పారు. అలాగే, మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన అనిల్ కెడ్కే(38) రైలు ఎక్కుతూ జారిపడి గాయపడ్డాడు. వికారాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

వర్గల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. వర్గల్ మండలం నాచారంకు చెందిన కుమ్మరి శైలజ(21) సోమవారం రాత్రి 9.00 గంటలకు తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకున్నది. 10.30 గంటలకు తండ్రి కృష్ణ లేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

తుర్కపల్లిలో..

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుర్కపల్లికి చెందిన వడ్డె హనుమయ్య(65) ఆగస్టు 15న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. హనుమయ్యకు మతిస్థిమితం సరిగ్గా లేదని తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8712656757 లేదా 8712661853 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి మంగళవారం తెలిపారు.







వీరులారా.. వందనం

● రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం ● ప్రాణాలు అర్పించిన యోధులు

బైరాన్‌పల్లి.. రజాకార్ల రాక్షసత్వాన్ని బలైన గ్రామం. ఒకే రోజు 96 మందిని నిజాం సైన్యం, రజాకారులు కాల్చి చంపారు. వయసులో ఉన్న ఆడవాళ్లను చెరిచారు. శవాల చుట్టూ బతుకమ్మ ఆడించి తమపై చాకిత్యాన్ని ప్రదర్శించారు. మొత్తంగా బైరాన్‌పల్లిని మరో జలియన్‌వాలా బాగ్‌గా మార్చేశారు. బైరాన్‌పల్లి ఒక్కటే కాదు ఉమ్మడి జిల్లాలో నాడు ప్రతి పల్లె నిజాంకు వ్యతిరేకంగా, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడింది. ఈ పోరాటంలో ఎందరో యోధులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారు. నిజాం ఏలుబడిలోని తెలంగాణ ప్రాంతం భారతదేశంలో భాగస్వామ్యం అయిన సెప్టెంబర్ 17 సందర్భంగా వారి త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే, వారి త్యాగాలు నేటి తరానికి తెలియ జేసేందుకు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పోరాట గడ్డ కోరుతోంది. నాటి పోరాట యోధులను గుర్తించాలనీ కోరుతోంది.

మరో జలియన్‌వాలాబాగ్.. బైరాన్‌పల్లి

● ఒకేరోజు 96 మంది కాల్చివేత

మద్దూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బైరాన్‌పల్లి.. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రత్యేక స్థానం. రజాకార్ల రాక్షసత్వానికి బైరాన్‌పల్లి, కూటిగల్, ఆకునూర్, మాసిరెడ్డిపల్లె, రేబిగుంట, గుండ్రాలపల్లి, పెరుమాళ్ల సంకీసలో వందలాది మంది బలయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన నారాయణరావు, గుండయ్య, జగదీశ్వర్, ఈశ్వరయ్య నిజాంను హతమార్చాలనే ధృడసంకల్పంతో హైదరాబాద్ వెళ్లారు. 1947 డిసెంబరు 4న సాయంత్రం 4.15 గంటలకు నిజాం సవారీ కింగ్ కోఠి రోడ్ నుంచి బయలుదేరగా, 4.25కు ఆల్ సెయింట్స్ సందు వద్ద నారాయణరావు బాంబు విసిరారు. ఈ బాంబు దాడి నుంచి నిజాం తప్పించుకున్నాడు. మరో పక్క రజాకారుల దౌర్జన్యాలు పెరిగిపోతున్న తరుణంలో కమ్యూనిస్టుల సహాయంతో యువకులతో కలిసి గ్రామ రక్షణ దళాలు ఏర్పాటు చేశారు. బైరాన్‌పల్లి గ్రామస్థుల చేతిలో రజాకార్ల నాయకుడు అవ్వల్‌సాబ్ కుమారుడు చనిపోగా, గ్రామాన్ని నాశనం చేయాలని రజాకారులు ఐదుసార్లు దాడిచేశారు. ఈ దాడుల్లో 9మంది రజాకారులు చనిపోయారు. ఇది రజాకారులకు పెద్ద సవాల్‌గా మారింది. గ్రామంపై నిజాం సైనిక బలగాలు దాడి చేయబోతున్నాయని కమ్యూనిస్టు నాయకులు పంపిన సమాచారం గ్రామానికి చేరలేదు. ఈ క్రమంలో 1948 ఆగస్టు ఆఖరివారంలో రజాకార్లు, పోలీసులు, మిలటరీ సాయంతో పెద్దఎత్తున గ్రామంపై దాడికి దిగారు. రాత్రి 12 గంటలకు జనగామ నుంచి 10 ట్రక్కులలో బయలుదేరి రాత్రి 3 గంటలకల్లా బైరాన్‌పల్లికి చేరుకుని గ్రామాన్ని చుట్టుముట్టారు. ఉదయం 4 గంటలకు బహిర్భూమికి వెళ్లిన వడ్ల నర్సయ్యను పట్టుకున్నారు. అతని సహాయంతో గ్రామంలోకి వస్తుండగా, ఆయన వారిని నెట్టివేసి గ్రామంలోకి రజాకారులు చొరబడ్డారని కేకలు వేయడంతో గ్రామస్థులు అప్రమత్తం అయ్యారు. దళ కమాండర్ రాంరెడ్డి వెంటనే ప్రజలు తగు రక్షణలో ఉండాలని నగారా మోగించారు. దీంతో బురుజు వద్ద గల గడీలోకి జనం పరుగులు పెట్టారు. యువకులు నాలుగు వైపులా చేతికందిన ఆయుధాలతో కాపుకాయగా, రాజకారులు గ్రామ పొలిమేర నుంచే కాల్పులు ప్రారంభించారు. ఒకటి గ్రామంలోని ఒంటరి రాజయ్య ఇంట్లో, రెండోది ఊరవతల, మూడోది బూరుజుపై పడింది. బురుజుపై తోపు పేలడంతో అక్కడ ఉన్న మందుగుండు సామగ్రి పేలి ఎనిమిది మంది చనిపోయారు. బురుజుపై నుంచి కాల్పుల శబ్దం ఆగిపోవడంతో రజాకారులు గ్రామంలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు చంపారు. మొత్తం 96 మందిని చనిపోయారు. వయసులో ఉన్న ఆడవారిని చెరిచారు. శవాల చుట్టూ బతుకమ్మలను ఆడించి కసి తీర్చుకున్నారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న కూటిగల్‌లో మరో 30 మందిని పొట్టన పెట్టుకున్నారు.



బైరాన్‌పల్లి బురుజు (ఫైల్)


బైరాన్‌పల్లి చరిత్రను భావితరాలకు అందించాలి



మరో జలియన్‌వాలా భాగ్ ఘటనను తలపించిన బైరాన్‌పల్లి నెత్తుటి గాధ నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఈ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చకుండా ఏడాదికోసారి వచ్చి నివాళులు అర్పిస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆనాటి పోరాట యోధులకు కనీసం పింఛన్ కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటు. సెప్టెంబర్ 17 అధికారికంగా విమోచన దినోత్సవం జరిపి, నాటి పోరాట యోధుల కుటుంబాలను ఆదుకోవాలి. గ్రామంలో స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలి.

- చల్లా చంద్రారెడ్డి, పోరాటయోధుడు, బైరాన్‌పల్లి

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ రోజుపై ఇప్పుడు వివాదాలు నడుస్తున్నాయి. ఆ వివాదాల సంగతి పక్కన పెడితే నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారతప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు.

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి)

ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17. ఈ ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. అయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నర్సింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగు తీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణనష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.




మహ్మదాపూర్‌లో నిర్మించిన స్మారక చిహ్నం

రణభేరి.. అనభేరి

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 16: నిజాంకు, అప్పటి జమీందారీ, పెత్తందారి వ్యవస్థలకు వ్యతిరేకంగా అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు రణభేరి మోగించారు. పోలంపల్లి కేంద్రంగా సింగిరెడ్డి భూపతిరెడ్డితో కలిసి అనభేరి ప్రభాకర్‌రావు ప్రజాసైన్యం ఏర్పాటు చేసి పోరాటం సాగించారు. ఈ దళలో 1948 మార్చి 14న అనభేరి ప్రభాకర్ రావు దళం చేరుకుంది. గ్రామస్థులతో సమావేశమై, గ్రామ శివారు బూసనగట్టు గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటుండగా రజాకారులు చుట్టుముట్టారు. గుట్టలపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ప్రభాకర్‌రావు దళానికి.. రజాకార్లకు గంటల తరబడి భీకరపోరు సాగింది. రష్యాకు చెందిన మిషన్‌గన్‌తో ప్రభాకర్‌రావు రజాకారులపైకి ఎదురుదాడికి దిగారు. ఈ పోరాటంలో దళం నేలకొరిగింది. ఇందులో ప్రభాకర్‌రావు, భూపతిరెడ్డిలతో పాటు మరో 10మంది దళ సభ్యులు హతమయ్యారు. సాయుధ పోరాటంలో కరీంనగర్ జిల్లాలో జరిగిన మొట్టమొదటి ఎన్‌కౌంటర్ ఘటన ఇదే. మహ్మదాపూర్ గుట్టల్లో ఎన్‌కౌంటర్‌లో అమరులైన 12 మంది అమరుల పేర స్తూపాలు నిర్మించారు.

పోరాటానికి ఊపిరిలూదిన చేర్యాల

● రజాకార్లను ఎదిరించిన వీరభూమి
● చరిత్రకెక్కని వీరన్నపేట, నాగపురి పోరాటం



షబాషీగూడెం గ్రామంలో రజాకార్ల క్యాంపు ఏర్పాటు చేసుకున్న గడి

చేర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలు గ్రామాలు ఉద్యమాలకు ఊపిరిగా నిలిచాయి. చేర్యాల మండలంలోని వీరన్నపేట, నాగపురి, ఆకునూరు గ్రామాల వీరోచిత పోరాటం చరిత్రకు ఎక్కలేదు. అమరుల కుటుంబాలను పాలకులు పట్టించుకోకపోవడంతో ఉసూరుమంటున్నారు. నిజాంకు వ్యతిరేకంగా నల్లగొండ జిల్లా భువనగిరి, ఆలేరు కేంద్రాలుగా ఆరుట్ల రాచంద్రారెడ్డి, కుర్రారం రాంరెడ్డిల నేతృత్వంలో జరిగిన పోరాటంలో చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన సుమారు 80 కుటుంబాలకుపైగా పాల్గొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. రక్షక దళంగా ఏర్పడి రజాకార్లను ఎదుర్కొన్నారు. గ్రామశివారులోని కుంటలు, కట్టలు, ఏనెలను ఆసరాగా చేసుకుని ఎనిమిది మంది రజాకార్లను చంపారు. దీంతో రజాకార్లు గ్రామంపై కసితో దాడులు జరిపి ఆరెల్ల అయిలయ్య, ఆరెల్ల బాలయ్య, ఆరెల్ల వీరయ్య, బొడుగం సిద్ధిమల్లయ్య, బొడుగం మీనయ్యతో పాటు మరొకరిని గ్రామశివారులోని బంజెరుబావి వద్ద గడ్డివాములో వేసి సజీవ దహనానికి పాల్పడ్డారు. ఆలేరు- జనగామ- దుద్దెడ మార్గాలలోని కల్వర్టులు, బ్రిడ్జిలు కూల్చడానికి యత్నిస్తున్న క్రమంలో మొగుళ్ల దుర్గయ్య, అరిగె మల్లయ్య, అరిగె లచ్చయ్యను రజాకార్లు తుపాకులతో కాల్చారు. దుర్గయ్య, మల్లయ్య మృతిచెందగా, లచ్చయ్య తప్పించుకుని కొన్నాళ్లక్రితం మృతిచెందాడు. మొగుళ్ల ముత్యంరెడ్డి, మొగుళ్ల ఎల్లారెడ్డి, ఎర్రం భూమయ్యలు నాగపురి క్యాంపులో అరెస్ట్‌చేశారు. అలాగే, మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన జొర్రిగల వీరారెడ్డి నాయకత్వంలో సాయుధపోరాటం సాగేది. నాగపురి, షబాషీగూడెంలో రజాకార్ల క్యాంపు కొనసాగుతుండగా, సమాచారాన్ని చేరవేస్తున్న 38మంది ముస్లింలను కుర్రారం రాంరెడ్డి, నాగపురికి చెందిన గొట్టం వెంకట్‌రెడ్డి, గొట్టం కేశవరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నాగపురి బురుజు వద్ద హతమార్చి, సమీపంలో బావిలో పూడ్చిపెట్టారు. దీంతో రజాకార్లు గ్రామాలపై దాడులు చేసి, వీరారెడ్డిని పట్టుకుని క్యాంపు జైలులో పెట్టారు. ఆయన దుస్తులను విప్పుకుని బురుజు నుంచి దూకి తప్పించుకుని రహస్యంగా ఉద్యమాన్ని నిర్వహించసాగాడు. కుర్రారం రాంరెడ్డిని పట్టుకున్న రజాకార్లు శబాషీగూడెం క్యాంపు వద్ద హత్యచేశారు. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన సందిటి వెంకట్‌రెడ్డి, ఏల శంకరయ్య, పున్నెల నర్స య్యలు సాయుధపోరాటంలో పాల్గొన్నారు. రజాకార్లు గ్రామంపై దాడికి పాల్పడి మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆటలాడించారు.

త్వరలోనే ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, పీఆర్సీ



ఉపాధ్యాయుడు గఫార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయులు

గజ్వేల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, పీఆర్సీని ప్రభుత్వం అందజేయనుందని శాసనమండలి సభ్యుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు మహ్మద్ గఫార్ ఉద్యోగ విరమణ అభినందన సభను పీఆర్టీయూ గజ్వేల్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు శ్రీపాల్‌రెడ్డి, డాక్టర్ వంటేరి యాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి హెల్త్‌కార్డులను ఆమోదించారని, త్వరలోనే ఉద్యోగులందరికీ షరతులు లేకుండా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వర్తింపజేసేలా హెల్త్‌కార్డులు వస్తున్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డిని ఒప్పించి గతం కంటే మెరుగైన పీఆర్సీని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు శాపంగా మరిన సీపీఎస్ పథకాన్ని రద్దు చేయించి, ఓపీఎస్ అమలుపరిచే ఉద్యమం నిర్మిస్తామని, సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఇందిరాపార్కు వద్ద 25 వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించామన్నారు. 11, 12 జీవోలు సవరించి బీఈడీ వారికి కూడా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పదోన్నతులు వచ్చేట్లు జీవో ఇప్పిస్తామని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా ప్రభుత్వంతో రివ్యూ పిటిషన్ కోర్టులో వేసేట్లు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వంగ మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, అదారాసుపల్లి శశిధరశర్మ, ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు : జాన్‌వెస్లీ

చేర్యాల/మద్దూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించబోరని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేట జిల్లా చేర్యాలలోని గాంధీ చౌక్ నుంచి ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి బురుజు వరకు సీపీఎం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాల్లో మాట్లాడారు. దున్నేవాడికే భూమి కావాలని కమ్యూనిస్టులు చేసిన వీరోచితపోరాటంతో పేదలకు 10 లక్షల ఎకరాల భూములను పంచిందన్నారు. పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ తామే వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూములున్నాయని, వాటిని పేదలకు పంచే దమ్ము బీజేపీకి ఉందా? అని ప్రశ్నించారు. చారిత్రక వీర బైరాన్‌పల్లిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు ఉడుత రవీందర్, నక్కల యాదవరెడ్డి, కాముని గోపాలస్వామి, కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి నాగరాజు, శశిధర్, తాడూరి రవీందర్ శెట్టిపల్లి సత్తిరెడ్డి, భాస్కర్, కొంగరి వెంకట్‌మావో ఆలేటి యాదగిరి పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సురవరం సుధాకర్‌రెడ్డి అజాత శత్రువు : చాడ

హుస్నాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత సురవరం సుధాకర్‌రెడ్డి అందరి హృదయాలను చూరగొన్న అజాత శత్రువు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో జరిగిన సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిబద్ధత, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎదిగారన్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు



చిన్నశంకరంపేట మండలం చందంపేట సహకారం సంఘం వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

చిన్నశంకరంపేట/తొగుట/తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇప్పటికీ యూరియా కష్టాలు తప్పడం లేదు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట సహకార సంఘానికి యూరియా లోడ్ రావడంతో రైతులు, మహిళలు అధిక సంఖ్యలో బారులుతీరారు. పోలీసుల పహారా మధ్య యూరియా విక్రయించారు. తొగుట మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు రాత్రి నుంచే పెద్ద సంఖ్యలో తొగుట మార్కెట్‌యార్డుకు చేరుకుని టోకెన్ల కోసం క్యూలైన్ కట్టి గంటల కొద్దీ నిల్చున్నారు. తొగుట ఆగ్రోస్ దుకాణానికి 1,560, కో ఆపరేటివ్ సొసైటీకి 450 యూరియా బస్తాలు రాగా.. అంతకంటే ఎక్కువ సంఖ్యలో రైతులు బారులుతీరారు. దీంతో పోలీసు పహారాలో ఒక్కొకరికి రెండు బస్తాల చొప్పున యూరియాను సాయంత్రం వరకు పంపిణీ చేశారు. మిగతా రైతులకు రెండురోజుల్లో పంపిణీ చేస్తామని, ఆందోళన చెందవద్దని అధికారులు చెప్పడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తూప్రాన్ పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 500 బస్తాల యూరియా రావడంతో రైతులు భారీగా తరలివచ్చారు. ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో ఒక్కొక్క రైతుకు ఒక యూరియా బస్తాకు టోకెన్లు అందజేశారు.



తూప్రాన్‌లో రాత్రి 8 గంటలకు కొనసాగుతున్న యూరియా పంపిణీ

రావి ఆకుపై మోదీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రాన్ని రావి ఆకుపై చిత్రించారు నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్. తెలంగాణ విమోచన దినాన్ని పురస్కరించుకుని సర్దార్‌పటేల్ ఎదుట నిజాం నవాబు తలవంచిన చిత్రాన్ని కూడా రావి ఆకుపై చిత్రించారు.



రావి ఆకుపై నరేంద్రమోదీ చిత్రం

ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అమీన్‌పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా 69వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బీరంగూడలో నిర్వహించిన బ్యాడ్మింటన్ రెండురోజుల సెలక్షన్ పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14, 17 బాల బాలికల విభాగంలో జిల్లాస్థాయి క్రీడా జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలకు బీరంగూడ సాయిరాంనగర్ కాలనీ వీరస్వామి బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా నిలిచింది. ముగింపులో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నర్రా భిక్షపతి, కాంగ్రెస్ నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, రమేష్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ, శ్రీనివాస్‌రావు, వీరస్వామి, సత్యారావు, విజయ్‌కుమార్, కిష్టయ్య, రమేష్, కరుణాకర్‌రెడ్డి, రవి గోపాల్‌గౌడ్, పవన్‌రాజ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సింగూరుకు వరద

పుల్‌కల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. అధికారులు మూడు క్రస్ట్ గేట్లను ఎత్తగా, మంగళవారం మూడు గేట్లను ఎత్తి వరద ప్రవాహాన్ని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 47,788 క్యూసెక్కులు వస్తుండగా, ఔట్ ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదైంది. ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 48,242 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 1,849 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 390 క్యూసెక్కులు ఆవిరవుతుండగా మొత్తం ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టులో 520.730 మీటర్లకు 17.313 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ వద్ద 4,5,6,7 నంబర్ క్రస్ట్‌గేట్లను 5 మీటర్లు, స్కువర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి



మంత్రి క్యాంపు కార్యాలయంలోకి పోయేందుకు వెళ్లేందుకు ఏబీవీపీ నాయకులు

హుస్నాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయాన్ని ఏబీవీపీ ఆధ్వర్యంలో ముట్టడించారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో పోలీసులకు, ఏబీవీపీ నాయకులకు తోపులాట జరిగింది. చివరికి ఆందోళనకారులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల అదిత్య, నాయకులు రాకేష్, చరణ్, పరశురామ్, జశ్వంత్, రాజేష్, రాజు, అంజి తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బర్మా రామచంద్రం అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని అన్నారు. గతంలో కంటే నేడు పార్టీ సంస్థ ఎంతో ముందుకు వెళ్తుండడం హర్షణీయం అన్నారు.

ఎర్రవల్లి గ్రామస్థుల సహకారం మరువలేనిది

● ఎన్ఎస్ఎస్ క్యాంప్ కోఆర్డినేటర్ డాక్టర్ సరిత

మర్కుక్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు గత వారం రోజుల క్రితం ఎర్రవల్లికి చేరుకుని గ్రామంలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్‌లు ప్రసన్న, సరిత తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినమే..

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే అని బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఆకుల విజయ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విమోచన దినోత్సవాన్ని పండగల జరుపుకోవాలని పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం పైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి వస్తే అధికారికంగా విమోచన దినోత్సవం జరుపుతామని చెప్పిన కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పాలన రజాకార్లను తలపించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కు తెలంగాణ విమోచన దినోత్సవం జరిపే దమ్ము లేదా అని నిలదీశారు.

సీజనల్ వ్యాధులపై కళా ప్రదర్శన



సూరంపల్లిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దౌల్తాబాద్ , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు పరిసరాల పరిశుభ్రత పై తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు ఊరూరా తిరుగుతూ ఆట పాటల ద్వారా కళా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ప్లాస్టిక్ నిషేధం, వాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రగ్స్‌ను నివారించాలని ప్రజలను చైతన్య పరుస్తూ సాంస్కృతిక కళాకారులు ఆట పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు ఆస రామారావు, బిట్ల ఎల్లయ్య, కమ్మరి నరసయ్య, తుమ్మల ఎల్లయ్య, సందుర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మద్దూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో మెడిసిటీ మేడ్చల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ఈ వైద్యశిబిరం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. జలుబు, జ్వరాలతో వచ్చిన వారికి వైద్యసేవలు అందించి మందులు అందజేసినట్లు వైద్యులు తెలిపారు.

దశాబ్దం దాటినా పూర్తి కాని రోడ్డు

● గుంతలు, బురదమయంగా రాయపోల్ - తిర్మలాపూర్ రోడ్డు
● నిధులు మంజూరై రెండేళ్లు దాటినా మొదలుకాని పనులు



గుంతలతో బురద పొలంగా మారిన రాయపోల్ - తిర్మలాపూర్ రోడ్డు

రాయపోల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే ఆ రోడ్డులో వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తాయి. నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. పద మూడేళ్ల క్రితం రాయపోల్ నుంచి తిర్మలాపూర్, గొల్లపల్లి రహదారికి కలిసే విధంగా సుమారు నాలుగు కిలోమీటర్ల మట్టి రోడ్డు వేశారు. కానీ మట్టిరోడ్డు వేసి దశాబ్దం దాటినా కనీసం గుంతల్లో మట్టి కూడా పోయలేదు. దీంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో రోడ్డంతా గుంతలతో పాటు బురదమయంగా మారింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. ప్రయాణికులు ఆయా గ్రామాలకు వెళ్లాలంటే రెట్టింపు దూరం తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది.

రెండేళ్ల క్రితం నిధులు మంజూరు..

రాయపోల్ పెద్దమ్మ గుడి నుంచి తిర్మలాపూర్ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం మూడు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ చేస్తూ ప్రభుత్వం అప్పుడే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తొందరగా రోడ్డు నిర్మాణం పూర్తి అయి తమ కష్టాలు తీరుతాయని భావించారు. కానీ ఇప్పటివరకు నిర్మాణ పనులు చేపట్టలేదు. ఈ విషయమై పీఆర్ ఈఏ రాంకుమార్‌ను వివరణ కోరగా రోడ్డుకు మంజూరైన శాంక్షన్ రద్దయిందని తెలిపారు. ఇటీవల తిరిగి ఎస్టిమేట్ వేసి ఇచ్చారని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలం వరకైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తిచేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

మిరుదొడ్డి/దుబ్బాక, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): దసరాలోపు ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి, గృహప్రవేశం పూర్తి చేయాలని సిద్దిపేట్ల అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు, మంగళవారం దుబ్బాక మున్సిపాలిటీలోని 15వ వార్డు, 6వ వార్డ్ చేర్వపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. దుబ్బాక పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వెనకబడి ఉందని, ముగ్గులు పోసిన ఇండ్లను వారంలోగా పునాదుల స్థాయిని పూర్తిచేయాలన్నారు. . దసరా పండుగ లోపు పూర్తి చేసుకుని, గృహప్రవేశం ప్రవేశం జరుపుకోవాలన్నారు. అలాగే మిరుదొడ్డి మండలం ధర్మారం, మిరుదొడ్డి గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో మాట్లాడి, ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను నిర్మించుకునే లబ్దిదారులకు విడుతల వారీగా వారివారి ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని తెలిపారు. ఇళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం ముగిసింది. ఈ నెల 10న ప్రారంభమైన ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవన్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ముగింపు సమావేశంలో క్యాంపులో పాల్గొన్న వలంటీర్లు ప్రత్యేక శిబిరంలో భాగంగా పరిశీలించిన సమస్యలు వారి అనుభవాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ జీవన్ కుమార్ మాట్లాడుతూ కొత్త అనుభవాలు మన మేధాశక్తిని పెంచుతాయని, ఇలాంటి క్యాంపుల వల్ల సామాజిక అవగాహన పెంపొందుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్యాంప్‌లో పాల్గొన్న వలంటీర్లకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

కరాటే బెల్ట్‌టెస్ట్ టోర్నీలో ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే బెల్ట్‌టెస్ట్ పోటీలో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 10మంది చిన్నారులు గోల్డ్‌మెడల్స్, 9మంది సిల్వర్ మెడల్, 20మంది గ్రీన్ బెల్ట్, ముగ్గురికి బ్లూ, ముగ్గురు ఆరెంజ్, ఐదుగురు ఎల్లోబెల్ట్ సాధించినట్లు అసోసియేషన్ చీఫ్, ఎగ్జామినర్ సెన్సాయి ఎం.ఎస్.పాషా తెలిపారు. ఈమేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు, ఏపీఎస్ ప్రతినిధులు అభినందించారు.

శివాలయం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొడకండ్ల గ్రామంలో గల పురాతన భోగేశ్వర ఆలయం యొక్క నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చెర్మన్‌గా బే తి సీతారాంరెడ్డి, వైస్ చైర్మన్‌గా కర్నాల గణేష్, ప్రధాన కార్యదర్శిగా చందా ప్రవీన్, కోశాధికారిగా బాణాల బిక్షపతి, ప్రచార కార్యదర్శిగా పుల్ల కనకయ్య, చిన్నోజు కరుణాకర్, మిగితా సభ్యులను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబదాస్ అన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్రగతి జూనియర్ కళాశాల, మంజీరా పాఠశాల విద్యార్థులు మంగళవారం మండలంలోని అహ్మదీపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటింటికి పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మాకే నామ్ ఏక్‌పేడ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కళాశాల ప్రిన్సిపాల్ మెట్టయ్యచౌదరి, ఎంపీహెచ్‌డబ్ల్యూ అధ్యాపకురాలు సంధ్య, అహ్మదీపూర్ గ్రామ కార్యదర్శి కుమారస్వామి, పీఈటీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కృష్ణ జన్మాష్టమి వేడుకలు



దుంపలపల్లిలో జన్మాష్టమి వేడుకలు

దుబ్బాక, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ దుంపలపల్లి వార్డులో సోమవారం లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం భాద్రపద మాసం కృష్ణ పక్షమి, అష్టమి తిథి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించడం సంప్రదాయంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా దుంపలపల్లి లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. ప్రధానంగా దుంపలపల్లి గ్రామానికి చెందిన మద్ది వంశీయులందరికీ లక్ష్మీనారాయణ ఇలవేల్పుగా ఉన్నాడు. తమ ఇంటి దైవమైన లక్ష్మీనారాయణ సేవలో తరించాలన్న భావనతో మద్ది వంశీయులంతా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మద్ది వెంకటేశం, మద్ది రమేష్, మద్ది బాలకిషన్, మద్ది సంతోష్, మద్ది పెద్ద శ్రీనివాస్, చిన్న శ్రీనివాస్‌లు కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ పోరోహితులు కోమాండూరి వేదాంత చారి, శ్రీధర్ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

సీపీఐ నిరంతరం పోరాటం

కోహెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పేదరికం ఉన్నంత కాలం ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కోహెడ మండలం శ్రీరాములపల్లిలో భూ నిర్వాసితుల సమస్యలపై క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. పేదలకు ఇచ్చిన డాక్యుమెంట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. 30 ఏళ్ల కింద పట్టాలు ఇచ్చిన లబ్దిదారులకు హద్దులు పెట్టలేదన్నారు. దీంతో నిరుపేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. శ్రీరాములపల్లిలో గతంలో ఇచ్చిన లబ్ధిదారులకు పట్టాలకు హద్దులు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు.దేశంలో ఆర్థిక సమానతలు, పేదరికం లేని సమాజాన్ని చూడడమే పార్టీ లక్ష్యం అన్నారు.



వర్గల్ మండలంలోని ఓ వ్యవసాయ భూమిలో వరదనీటికి కొట్టుకొచ్చిన ఇసుక మేటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

282.08 ఎకరాల్లో పంట నష్టం

(5వ పేజీ తరువాయి)

చొప్పున నష్టపరిహారం అందించనున్నది. జిల్లాలో నష్టపోయిన 282.08 ఎకరాలకు గానూ రూ. 28,20,800 ప్రభుత్వం తరపున పరిహారం అందనున్నది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నారు. పంట నష్టపోయిన రైతు పేరు, సర్వే నంబర్, రైతు పాస్ బుక్ వివరాలు, రైతు అకౌంట్ నంబర్, పంట నష్టం జరిగినట్లు ఫొటో తదితర వివరాలను అధికారులు సేకరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కొమురవెల్లి, సెప్టెంబర్16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 21 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా మంగళవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బొమ్మగోని రమేష్ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బద్దిపడగ గ్రామసభ బహిష్కరణ

నంగునూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని వీధి దీపాలు, సానిటరీ నిర్వహణ బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేసిన తర్వాతనే గ్రామసభ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నంగునూరు మండలం బద్దిపడగ గ్రామస్థులు గ్రామసభను బహిష్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేశ్‌కు గ్రామ సమస్యలు వివరిస్తూ వాటి సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు.

పారిశుధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

● జడ్పీ సీఈవో రమేష్

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జడ్పీ సీఈవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాలను సందర్శించారు. అలాగే తిగుల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉండడం వల్ల నెల రోజుల పై నుంచి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్ రెడ్డి

కోహెడ/సిద్దిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో అండర్ 17 వాలీబాల్ రాష్ట్రస్థాయి జట్టుకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గజ్వేల్‌లో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో విద్యార్థులు రక్షిత్, అభిషేక్ సెలక్ట్ అయ్యారు. ఈనెల 25 నుంచి 29 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలలో భాగంగా వాలీబాల్ జిల్లా జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

కబడ్డీలో శనిగరం విద్యార్థులు

సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ బాలికల విభాగములో కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు శ్రీదేవి, శ్రీహర్షిత, ప్రణీత, అలాగే బాలుర కబడ్డీ పోటీలలో వివేక్ అనే విద్యార్థి మంగళవారం గెలుపొందారు. ఈ నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యారు.

మండల విద్యాధికారికి సన్మానం

దౌల్తాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో జరుగుతున్న దౌల్తాబాద్, రాయపోల్ మండలాల పాఠశాలల కాంప్లెక్స్ సముదాయ సమావేశంలో మంగళవారం మండల విద్యాధికారి గజ్జల కనకరాజును, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అనిల్ కుమార్‌లను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్ద్రా మహోత్సవం

కొండపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళ వారం ఆర్ద్రా మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా సంతాన మల్లికార్జున స్వామివారికి సంతాన పాశుపత అభిషేకం శ్రీ విజయదుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. సంతాన పాశుపత హవనం పూర్ణాహుతి జరిగాయి.మోహనకృష్ణ శర్మ వేదవ్యాస్ శర్మ లక్ష్మణరావు వైదిక కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు దుస్తులు అందజేసిన ప్రభుత్వం

మద్దూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లోని హస్టళ్లలోని విద్యార్థులకు 4 జతల దుస్తుల్ని ప్రభుత్వం అందించింది. ఈ సందర్భంగా వార్డెన్లు చంద్రశేఖర్, సుధాకర్ మాట్లాడారు. మద్దూరులో 30 మంది, ధూళిమిట్టలో 22 మంది విద్యార్థులు వసతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి 4 జతల చొప్పున ధూళిమిట్టకు 88, మద్దూరుకు 120 దుస్తులు సరఫరా చేసినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలోనే విద్యార్థులకు దుస్తులు అందజేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాల్ని అందిస్తుండటంతో వసతి గృహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు.

నవోదయ దరఖాస్తుల స్వీకరణ

వర్గల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికై అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ మంగళవారం తెలిపారు. అసక్తి గల విద్యార్థులు ఈ నెల 23వ తేది వరకు దరఖాస్తు చేసుకోవలేనని, ప్రవేశ పరీక్ష వ్రాసే విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులు అయి ఉండాలని, 2026-2027 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతి ప్రవేశానికై నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరౌతున్న విద్యార్థులు ప్రస్తుత సంవత్సరంలో 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ ఉండాలి, అదే విధంగా 11వ తరగతి ప్రవేశానికై దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2025-26 సంవత్సరంలో పదో తరగతి చదువుతూ ఉండాలని తెలిపారు. 9వ తరగతి, 11వ తరగతిల ప్రవేశ పరీక్ష తేది 7-02-2026 శనివారం రోజను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఓజోన్ దినోత్సవం



మర్కుక్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన చార్టులతో ఉపాధ్యాయులు

మర్కుక్/వర్గల్/హుస్నాబాద్‌టౌన్/గజ్వేల్ రూరల్/సిద్దిపేట కల్చరల్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 31వ ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని జిల్లాలోని మంగళవారం పలు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది ఓజోన్ పొర గురించి వివరించారు.

దారి ఇలా.. పాఠశాలకు వెళ్లేదెలా..!



బీడీకాలనీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో దారి దెబ్బతినడంతో విద్యార్థుల ఇబ్బందులు

చేర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలకేంద్రం శివారు బీడీకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే ప్రధానదారి దెబ్బతినడంతో విద్యార్థుల నడకకు నరకప్రాయంగామారింది. చాలాయేళ్లక్రితం కాలనీ శివారులో పాఠశాల నిర్మించడంతో కాలనీకి చెందిన చిన్నారులంతా అదే పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. కానీ కాలనీనుండి సరైన మార్గంలేక చిన్నపాటి దారిగుండా నిత్యం నడుచుకుంటూ వెళ్తున్నారు. పల్లపుప్రాంతంలో ఉండటంతో వర్షం నీరంతా ప్రవహించి దారంతా ఒర్రెలా మారి కోతకు గురవుతుంది. దారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు విస్తరిస్తుండటం, విషప్రాణులు సైతం సంచరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దారికోతకు గురై ఇసుక మేట వేయగా, పిచ్చిమొక్కలు తొలగించి దారిమరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులకు విన్నవించుకున్నా పెడచెవినపెట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈమేరకు ఉన్నతాధికా రులు స్పందించి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి దారికష్టాలు తీర్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

సీఎంను కలిసిన పూజల హరికృష్ణ



సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సిద్దిపేటనియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరికృష్ణ జిల్లాలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం స్పందిస్తూ అంతర్గత విభేదాలపై పార్టీ చూసుకుంటుందని, అవేమీ పట్టించుకోవద్దని సూచించినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సీఎం చెప్పారని, సీఎం ఇచ్చిన స్ఫూర్తితో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పనిచేస్తామని హరికృష్ణ తెలిపారు.

ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

చిన్నకోడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఎన్ఎస్ఎస్ యూనిట్ 5 ఆధ్వర్యంలో చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో ఏర్పాటు చేసిన క్యాంపులో భాగంగా మంగళవారం' ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కాలనీల్లో తిరుగుతూ రోడ్లపై గల ప్లాస్టిక్‌ను సేకరించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ తీశారు.